క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తిరుపతి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జడ్జి ఎ.పార్థసారథి అన్నారు. ఆదివారం వినియోగదారుల హక్కులపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 18న న్యూఢిల్లీలో ఆశ్రా అడ్వొకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ సమ్మిట్ జరుగుతుందన్నారు. ఎపుడైనా వారి హక్కులకు ఇబ్బందులు తలెత్తితే న్యాయం జరిగేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆసరా కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది అరికింబేడు మునిశేఖర్, తిరుపతి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యుడు ఎస్ శిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ


దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న డీఎస్పీ భీమారావు

శ్రీకాళహస్తి: మానవసేవే మాధవసేవ అని శ్రీకాళహస్తి డీఎస్పీ భీమారావు అన్నారు. పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులు, వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నానని, కానీ ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ నిర్వాహకుడు మునీర్‌బాషాను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు కంతా ఉదయ్, బాబా ఫరీద్, రాజేశ్వరరావు, హరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


జేసీబీతో ఏర్పాటు చేస్తున్న పైపులైన్

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో సర్పంచ్ పాతగుంట మంజుల ఆధ్వర్యంలో ఆదివారం తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. గ్రామంలో 90 మీటర్ల మేర తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటి సమస్య తలెత్తడంతో గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాతగుంట గురవారెడ్డి, చెంబేటి మునిరత్నంరెడ్డి, కోదండరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, దామోదరంరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవభారత నిర్మాణానికి విద్యార్థులు తోడ్పడాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ పద్మావతి

వరదయ్యపాళెం: విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని నవభారత నిర్మాణం కోసం పాటుపడాలని వరదయ్యపాళెం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి పిలుపునిచ్చారు. ఆదివారం 55వ జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలు గన్న నవభారత నిర్మాణానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అలాగే కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు జాతీయ సేవా పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఫక్రుద్దీన్, అధ్యాపకులు రవి, షాహుల్, దమయంతి, రాధమ్మ, శశికళ, శాంతకుమారి పాల్గొన్నారు.

సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర

తిరుపతి సిటీ : సమాజ సేవలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కీలక పాత్ర పోషిస్తోందని ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య తెలిపారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన వీసీ జీఎస్ఆర్ క్రిష్ణమూర్తితో కలిసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజ సేవకు అంకితం కావాలని సూచించారు. గత ఏడాదిగా విశ్వవిద్యాలయం తరపున ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేసిన సేవా కార్యక్రమాలను అధికారులు వివరించారు.


పిచ్చాటూరు చిన్నవీధిలో..


పాపానాయుడుపేటలో దాసరి యూత్ ఆధ్వర్యంలో వినాయకస్వామి ఊరేగింపు


మడిబాకలో లడ్డును తీసుకుని వెళ్తున్న చంద్రమ్మ

గంగ ఒడికి గణనాథుడు

వినాయకచవితిని పురస్కరించుకుని వాడవాడలా ఆదివారం గణపతి నిమజ్జనాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో నిమజ్జన వేడుకలు జరిగాయి. స్థానికులు రంగులు చల్లుకుంటూ ఉట్టి కొట్టి సందడి చేశారు. వినాయకుడికి విశేష పూజలు చేసి డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులో నిమజ్జనం చేశారు. పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

నారాయణవనం: నారాయణవనంలో 30కిపైగా విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి కీళగరం చెరువులో నిమజ్జనం చేశారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ పరమేష్ నాయక్ పర్యవేక్షించారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం

పిచ్చాటూరు: పిచ్చాటూరు పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. విగ్రహాలను ట్రాక్టర్‌పై సుందరంగా అలంకరించారు. అనంతరం అరణియార్ జలాశయంలో నిమజ్జనం చేశారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణాల్లో భక్తులకు అన్నదానం చేశారు. యువకులు రంగులు చల్లుకుంటూ నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.


వరదయ్యపాళెంలో..

అన్నదానం

నాగలాపురం: మండలంలోని సుమో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

నిమజ్జనోత్సవం

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలకు నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం డప్పులు, వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ వరదయ్యపాళెం, రాచర్ల, నాగనందాపురం, పెద్ద పాండూరు గ్రామాల్లో యువత నృత్యాలతో నిమజ్జనానికి వినాయక విగ్రహాలను తరలించారు.

ఏర్పేడు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం వైభవంగా జరిగింది. గ్రామాల్లో వినాయక స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. యువకులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉట్టి కొట్టారు.


పాపానాయుడుపేటలో త్రిశూల్ వినాయకుని ఊరేగింపు

లడ్డూ వేలం..

మండలంలోని మడిబాకలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన ఓ భక్తురాలు స్వామివారి లడ్డూను రూ.52,500 దక్కించుకుంది. వినాయక స్వామి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. 11 కిలోల లడ్డూను వేలంలో మునిరత్నం నాయుడు సతీమణి చంద్రమ్మ దక్కించుకుని భక్తి శ్రద్ధలతో తీసుకెళ్లింది. ఆదివారం సాయంత్రం పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. జైబోలో గణేష్ మహరాజ్‌కీ..అంటూ చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.


నారాయణవనం: వాణిజ్య సంఘం వినాయకుడు


నారాయణవనం: రెడ్డి వీధి వినాయకుడు


పిచ్చాటూరు: నిమజ్జనానికి తరలివెళుతున్న విఘ్నేశ్వర ప్రతిమలు


నాగలాపురంలో..

వందేభారత్‌కు ఘనస్వాగతం

శ్రీకాళహస్తి: విజయవాడ నుంచి చెన్నైకు నూతనంగా ప్రారంభించిన వందేభారత్ రైలు ఆదివారం రాత్రి శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సందర్శనార్థం కొద్దిసేపు నిలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి జాతీయజెండా చేతపట్టి స్వాగతం పలికారు. అనంతరం రైలు ఎక్కి వసతులు ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడ నుంచి చెన్నైకు వెళ్లే వందేభారత్ రైలులో ప్రయాణికులకు అత్యాధునిక వసతులు కల్పించారన్నారు. వేగవంతమైన, సౌకర్యవంతమైన అనుభూతిని కలిగిస్తుందన్నారు. ఈ రైలుకు స్వాగతం పలికిన అతిథులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యంత అనువైన ప్రయాణం సాధమన్నారు. కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నగేశ్, నాయకులు ఫజల్, సురేష్, ఫరీద్, శివకుమార్‌యాదవ్, దాము, రుషేంద్రమణి, ధనలక్ష్మి, బీజేపీ నాయకులు గరికపాటి రమేష్, కుప్పప్రసాద్, కొండేటి గోపాల్, మద్దు వాసుయాదవ్ డిల్లీకుమార్ తదితరులు పాల్గొన్నారు.


వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న బియ్యపు పవిత్రారెడ్డి, ఇతర నాయకులు

దేశ సమైక్యతకు కృషి చేయండి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): వలంటీర్లు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని, కమ్యూనిటీ భాగస్వామ్యం, దేశ సమైక్యతకు కృషి చేయా లని ప్రిన్సిపల్ వి.సుధాకర్ కోరారు. ఆదివారం మండలంలోని ఎస్వీపి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డేను ప్రిన్సిపల్ వి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ పీఓ కేసీ రేణుకమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఏటా సెప్టెంబర్ 24వ తేదీని జాతీయసేవా పథకం దినంగా నిర్ణయించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల నుంచి చెంచులక్ష్మి కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు బహుమతులను ప్రదానం చేశారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


ఆకట్టుకుంటున్న స్వామి వారి తలపాగాలు






కళాకారుల కళా ప్రదర్శనలు





శోభాయమానం.. స్నపన తిరుమంజనం

తిరుమల: రంగురంగుల గాజులు, ఆప్రికాట్ ఫలాలు, వట్టివేరు, కురువేరు, రోజామాలలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి స్నపన తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు వరకు అర్చకస్వాములు వేద మంత్రోచ్చరణల మధ్య స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపనిషత్తు, దశశాంతి మంత్రములు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం, వేదాలను పారాయణం చేశారు. తిరుమల పెద్ద జీయంగార్, తిరుమల చిన్న జీయంగార్ వివిధ పాశురాలను పఠించారు. ఈ వేడుకలో రంగురాళ్లతో కూడిన గాజుల మాలలు, ఆప్రికాట్ మాలలు, వట్టివేరుమాలలు, కురువేరుమాలలు, రంగురంగుల రోజామాలలు, పసుపు రోజామాలలు, మిక్సడ్ డ్రైఫ్రూట్స్ మాలలు, తెలుపు ముత్యాల మాలలు, కిరీటాలు, తులసి మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ మాలలను తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన రాజేందర్ విరాళంగా అందించారు. అదేవిధంగా హైదరాబాదుకు శ్రీహరి, శ్రీధర్, శ్రీనివాస్ విరాళంతో రంగనాయకుల మండపంలో సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్లతో విశేషంగా అలంకరించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సూర్యప్రభ వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి, జేఈవో తదితరులు




కళాప్రదర్శనలు


స్వామి వారికి అలంకరించేందుకు తెచ్చిన దండలు